
# బొద్దెంకలు

సోమసుందర్




"గత వేసవిలో మా అన్నా, నేనూ బొంబాయి వెళ్ళాం!" అంది లక్ష్మి. చాలాకాలం తర్వాత కలుసుకున్నామేమో, ఎడతెరిపిలేకుండా చెప్పేస్తోంది. పదిహేడేళ్ళకే ఎంత ఆరిందాలా మాట్లాడేస్తోంది! అసలే వాగుడుకాయ! నిజానికదో వార్తా కాదు; ఈ కథకు ప్రారంభమూ కాదు ... లక్ష్మి చెబుతూనే వుంది—

"రకరకాల వాతావరణాలనుంచీ, రకరకాల ప్రదేశాలనుంచీ శరవేగంతో దూసుకుపోయింది మా రైలును. బొంబాయి చేరేసరికి మధ్యాహ్నం పన్నెండయింది ...

స్టేషనులో దిగిన జనం కిటకిటలాడుతున్నారు. అంత పెద్ద బొంబాయికి అంత చిన్నగేటు పెట్టడం అన్యాయమే అనిపించింది. అయినా మేమేం చేయగలం? జనమంతా వెళ్ళే వరకూ ఆగడం మంచిదనుకున్నాం. ఒక ప్రక్కగా నుంచున్నాం. చిత్రమేమంటే మర్యాదకోసం వెనక్కు ఉండిపోయినందువల్ల ఒరిగే లాభమేమీ ఉండదు. పైగా చేతగాని తనం బయటపడుతుంది!...తెలుగు మహాకవి ఒక్కినే అన్నాడా? – 'వెనకపడితే వెనకే నోయ్!' అని ... అచ్చంగా అలాగే అయింది మా పని! ...

టిక్కెట్లు వాపసుచేసి, బయటపడేసరికి కనీసం పావుగంటయినా పట్టి ఉంటుంది. ఆ స్టేషను ఠీవి, ఆ అందం, హుందాతనం! అబ్బ చూసితీరవలసిందే! మేమూ బయటకి వచ్చామో లేదో, స్టేషను కెదురుగా, టాక్సీ స్టాండింగు ప్రక్కనే, ట్రాఫిక్ ఐలెండు లాన్ దగ్గర ఒక పెద్ద గుంపు ప్రోగుపడి వుంది. ఇంచుమించు స్టేషన్‌లో బయటపడ్డవాళ్ళంతా అక్కడ చేరి తమాషా చూస్తున్నట్లుంది. రకరకాల కేకలు... బొబ్బలు... ఏమిటో ఎవరికీ తెలియదు!"

నేనాశ్చర్యంగా వింటున్నాను. నా ఆశ్చర్యం చూస్తూ కాస్సేపు ఆపింది లక్ష్మి...

"జాగ్రత్తగా చూస్తూండు; ఇది బొంబాయి తెలుసా?" అన్నాడు మా అన్న సామానులు టాక్సీ స్టాండింగు దగ్గర దింపిస్తూ... తాను గబ గబ అడుగులు వేస్తూ గుంపుకేసి వెళ్ళిపోయాడు. చుట్టూ దీర్ఘకాయులు నిలబడి ఉన్నారు. నాకు బొత్తిగ ఏం జరుగుతున్నదీ తెలియటంలేదు. నేనొక కంట సామాను చూస్తున్నాను, రెండో కంట గుంపును పరిశీలిస్తున్నాను.

పది నిమిషాలు గడచింది; మా అన్న రాలేదు... మా అన్న అజానుబాహుడు. వస్తాదులా ఉంటాడు. దెబ్బలాటలంటే చొరవగా దూసుకు పోతాడు. ఏం జట్టీ తెస్తాడో ఏమో?... నాకు ఆదుర్దా పెరిగిపోతోంది. సుమారు ముప్పయ్యారు గంటలు ఏకటాకీని బండిలో కూర్చుని ఉన్నామేమో, నా బుర్ర బోరెత్తిపోతోంది. విసుక్కున్నాను. మా అన్నను తిట్టుకున్నాను. 'ఛీ యిదెక్కడి మేళం? ఎంతకీ రాడేమిటి! వెధవ గొడవ...'

## 2

పోలీసులు మాత్రం ప్రత్యక్షమయ్యారు! గుంపును చెదరిపొమ్మని కేకలు వేస్తున్నారు. లాఠీలు

నేలపై బాదుతున్నారు... గుంపు చీలింది. ఇద్దరు పోలీసులు చెరోప్రక్కా నడుస్తున్నారు. మధ్యలో ఒక నడివయస్కురాలుంది. దానిని నడుపుకుంటూ నా ముందునుంచే తీసుకుపోతున్నారు. ఆమె చేతుల్లో ఒక పసిపాప ఉంది. పది నెలల వయసుంటుందేమో ? రాగి రంగు శరీరం; నల్లనిజుత్తు... గుండ్రంగా రబ్బరు బొమ్మలా చక్కగా ఉంది. ఎందుకో గుక్క తిప్పకుండా ఏడుస్తోంది. ఆడమనిషి మాంచి బలంగా, మోటుగా ఉంది. తాంబూలం నములుతోంది. పెదవులు ఎర్రగా ఉన్నా — పళ్ళు గారెక్కి నల్లగా ఉన్నాయి. మరాటీలో ఏదో గొణుగుతూ నడుస్తోంది. పోలీసులు అదమాయిస్తున్నారు...

"ఇంతకీ జరిగిందేమిటి ?... ఎందుకు ప్రోగుపడ్డారు జనం ? ఆ మనిషెవరు ?" అంటూ గబగబ ప్రశ్నలు కురిపించాను. లక్ష్మి నవ్వుతూ అందుకుంది.

"చెబుతానుండండి. అప్పటికింకా నాకేమీ తెలియందే ! మా అన్న యింకా రావడంలేదని విసుక్కుంటూనే ఉన్నాను. సరిగ్గా అల్లంత దూరంలో వస్తూ కనిపించాడు. ప్రక్కనే ఎవరో ఉన్నారు. మాట్లాడుకుంటూ నెమ్మదిగా వస్తున్నారు. ఎర్రగా,నిండుగా,ఎత్తుగా ఉన్నారాయన. చక్కని ఖరీదయిన సూటు వేసుకున్నారు. గౌరవంగా పెద్దమనిషి తరహాగా ఉందాయన మొగం ! వాళ్ళిద్దరూ నా దగ్గరగా వచ్చేశారు. అన్నతో ఆయన తీవ్రంగా చర్చిస్తున్నారు. హిందూస్తానీ యింగ్లీషూ కలగలిపి మాట్లాడుతున్నారు వాళ్ళిద్దరూ ! నాకు దగ్గరగా వచ్చిన తర్వాత, ఆ పెద్దమనిషి, "రండి, నా కారు వచ్చింది ! మిమ్మల్ని డ్రాప్ చేస్తాను" అన్నారు గౌరవంగా !

వెంటనే మా అన్న — 'అక్కర్లేదండి, థాంక్స్, మా చెల్లీ నేనూ అంధేరీ వెళ్ళాలి !' అన్నాడు. పరస్పర అభినందన లాంఛనాలన్నీ ముగిశాయి. ఆ పెద్దమనిషి చిరునవ్వుతో వెళ్ళిపోయాడు, అది నన్నుద్దేశించో మా అన్నని ఉద్దేశించో నా కర్థంకాలేదు. నన్ను సమీపిస్తూనే మా అన్న — "సామాను జాగ్రత్తగా ఉందా ?" అన్నాడు, పరీక్షించాడు. టాక్సీని పిలిచాడు. సామాను పెట్టించాడు. ఎక్కి కూర్చున్నాం.

షట్టర్సు వేస్తూ మా అన్న స్వగతంగా అన్నట్టు అంటున్నాడు —

"వెధవ డబ్బు ! — డబ్బుకోసం మనుషులు ఎంతటి ఘాతుకమైనా చేస్తారు ! రాను రాను మరీ రాక్షసత్వం పెరిగిపోతోంది !" అని.

నాకేం అర్థం కాలేదు. దేన్ని గురించి చెబుతున్నాడో ! ఇంతట్లోకే ఇంత విరక్తి ఎందుకు కలిగిందో ? — ఏమీ అర్థం కావడంలేదు ...

## 3

"ఏమిటి జరిగిందసలు ? ఏమిటా గుంపు ?" అని అడిగాను — అంటూ లక్ష్మి చెప్పుకుపోతోంది. తాను వచ్చేముందో ఆడదాన్ని పిల్లతో సహా పోలీసులు తీసుకుపోవడం చూశావా అని వాళ్ళన్న అడిగాడు. 'అదీ అసలు కారణం' అంటూ ముక్తాయించాడు.

"ఆఁ... ఆఁ... అవునవును. దుఃఖంలా వుంది



అంచనాలకు మించిన అత్యధిక మెజారిటీతో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి శ్రీ రోనాల్డ్ రేగన్ (69) అమెరికా 40వ అధ్యక్షునిగా ఎన్నిక కావటంతో ప్రపంచ రాజ్యాల చూపంతా యిప్పుడు అమెరికామీద ఉన్నది. శ్రీ రేగన్ జనవరిలో పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు.

# బొద్దెంకలు

పాప ! గుక్కపెట్టి ఏడుస్తోంది." అని జవాబు చెప్పింది లక్ష్మి ! వాళ్ళన్న చెప్పిన దాని కథను లక్ష్మి చెబుతోంది.

"ఆ జనం పోగయిన స్థలంలో ఆ మనిషి పాపను చూపిస్తూ అడుక్కుంటోందట ! ఆ పిల్ల పుట్టు గుడ్డిదని, ఎవరూ దిక్కులేనిదనీ చెబుతోందట ! పాప కళ్ళను ఒక గుడ్డతో కట్టేసిందట! డబ్బులు బాగానే రాలుతున్నాయి. ఉదయం నుంచీ అడుక్కుంటూనే ఉందట !..." అంటూ మా అన్న కథంతా చెబుతున్నాడు. టాక్సీ వేగంగా పోతోంది, రోడ్డు దాటుకుంటూ, జనాన్ని తప్పించుకుంటూ... ఒక కంటితో నేను బొంబాయి నగర శోభ తిలకిస్తున్నాను. మేడలు ఆకాశాన్నంటుతున్నాయి. రెండో కంట మా అన్నని కనిపెడుతున్నాను. వాడి ముఖం ఉద్రేకంతో జేవురించి ఉంది. ఊపిరి గట్టిగా పీలుస్తున్నాడు. "అయితే ఏం జరిగింది ?" ఉత్కంఠతో ...

"ఇప్పుడు నన్నిక్కడికి దిగపెట్టిపోయాడు చూశావా ? ఆయనొక గొప్ప డాక్టర్. బొంబాయిలో పేరుమోసిన కంటి వైద్యుడు. ఆయనా యిప్పుడే ట్రెయిను దిగి వస్తున్నాడు. అందరినీ అడిగినట్టే ఆయన్నీ ధర్మం అడిగిందట అది. వెంటనే ఆయన పైసలిచ్చేసి యథాలాపంగా తన దారిని తానుపోలేదు. 'ఏదీ ఆ కట్టు విప్పి చూపించు. వీలయితే నేనా కళ్ళు బాగుచేస్తాను' అంటూ దిచ్ఛగత్తె నడిగాడట. 'వద్దులెండి బాబూ, మీ దారిని మీరు వెళ్ళండి — అదే చాలు !' అన్నదేకాని కట్టు విప్పలేదట.

డాక్టర్‌కు పట్టుదల పెరిగింది. అనుమానమూ వచ్చింది. కట్టు విప్పమని వత్తిడి చేశాడు. జనం పోగవ నారంభించారు. డాక్టర్‌గారి మాట విని కట్టు విప్పి చూపించమని, ఒత్తిడి చేశారు. ఆ ముష్టిది వినలేదు. జనానికి పట్టుదల పెరిగింది. ఎవరో మొండివాళ్ళు ఆ మనిషిని గట్టిగా పట్టుకొని — పిల్ల కళ్ళకి కట్టినగుడ్డ విప్పేశారు! ఆ ముష్టిదాని బండారం బయటపడిపోయిందని లబోదిబోమని అరవ నారంభించింది. నోటికి వచ్చిన కారు కూతలు కూస్తోంది."

"అసలు పాప గుడ్డిది కాకపోయినా అలా మోసం చేస్తోందా ?" అన్నాను అమాయకంగా ! సాధారణంగా ఇలాంటి నటన ముష్టివాళ్ళకు పరిపాటే కదా అన్న దృష్టితో ! "అబ్బే ! కాదు చెల్లీ ! ఆ పాప కళ్ళమీద రెండు బొద్దెంకల్ని పెట్టి కట్టేసింది. ఆ బొద్దెంకలు పసిదాని కనుగుడ్లు పొడుముకు తినేస్తున్నాయి !" అన్నాడు మా అన్న తీవ్రబాధతో మూలుగుతూ !

"అయ్యబాబోయ్ ! బొద్దెంకలే !" అన్నాను నేను. శ్రోతగా నాకే యింత ఆశ్చర్యం కలిగితే లక్ష్మి ఎంత బాధపడిందో !

"చూడు చిత్రం ! తద్వారా నోరెరుగని పసికూనని గుడ్డిదాన్ని చేసి తన పబ్బం గడుపుకోవాలని ఆ ముష్టిదాని ఆలోచన ! ఎంత దారుణాలు చేస్తారో చూడు !" అన్నాడట వాళ్ళన్న !

వాళ్ళన్న కళ్ళలో కోపమూ, అసహ్యమూ, స్పష్టంగా నాకే కనిపించాయి !

"ఎంత దారుణం ? మానవత్వం మంటకలసిపోతోంది ! తర్వాత ఏమైంది ?"

"డాక్టర్‌గారు ఒదిలిపెట్టలేదు. కళ్ళులేని నిర్భాగ్యులకు నేత్రదానం చేయడమే తన జీవిత ధ్యేయంగా పెట్టుకున్నాడు. సృష్టి యిచ్చిన నేత్రాల్ని మనిషి తన స్వార్థంకోసం కావాలని విచ్ఛిన్నం చేస్తుంటే ఎలా చూసి ఊరుకుంటాడు ? పోలీసుల్ని పిలిపించారు. కేసు పెట్టించాడు. ఆ ముష్టిదాన్ని అరెస్టు చేయించాడు. అక్కడున్న వాళ్ళని సాక్ష్యం వేయించాడు !'

"ఇలాంటి దుర్మార్గులకి తగిన శిక్ష పడాల్సిందే !" అని లక్ష్మి తన అభిప్రాయం ప్రకటిస్తే — వాళ్ళన్న — "పేదరికం, ఆకలి, అజ్ఞానం మనిషిని ఎంత రాక్షసిగా మారుస్తోందో !" అన్నాడట ! ఇందులో ఏది నిజమో శ్రోతగా నేను చప్పున తేల్చుకోలేకపోయాను.

బిడ్డ పుట్టగానే కొందరు ముష్టివాళ్ళు సూదితో పిల్లల కళ్ళు కుట్టేసి, పెంచ నారంభిస్తారట ! అంధత్వం వాళ్ళ వ్యాపారానికి గొప్ప పెట్టుబడి. అలాంటి కథలు నే నిదివరకే ఎన్నో విన్నాను. బొద్దెంకల కథ చిత్రమే మరి !

ఏమైతేనేం — దేశమంతా రకరకాల గుడ్డివాళ్ళ గుంపులాగ పెద్ద ఆర్తనాదం చేస్తున్నట్టు తోచింది నాకు. దీనజన సముద్రం ఘోషిస్తున్నట్టు వినిపించింది నాకు ! ★